క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నా అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొత్తనవరసపురం రహదారిలో భారీ గోతులు



గోతులమయంగా ఉన్న కొత్తనవరసపురం రోడ్డు

నరసాపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల రహదారులు గోతులమయంగా ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారులపై ఉన్న గోతుల్లో నీరు నిలిచిపోయింది. ప్రధానంగా కొత్తనవరసపురం- పాతనవరసపురం రహదారి పలుచోట్ల అధ్వానంగా తయారయ్యాయి. పలుచోట్ల రోడ్లపై ఉన్న గోతుల్లో నీళ్ల నిలబడి ఉండటంతో ప్రయాణానికి అసౌకర్యంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కానిస్టేబుల్ రమణను ఆదర్శంగా తీసుకోవాలి



ఫైర్ కానిస్టేబుల్ రమణను సత్కరిస్తున్న అంబరీష్

పెనుగొండ: విధులు నిర్వహించడంలోనూ, సేవా కార్యక్రమాల్లోనూ పాలకొల్లు అగ్నిమాపక కేంద్రం ఫైర్ కానిస్టేబుల్ బీవీ రమణను ఆదర్శంగా తీసుకోవాలని నరసాపురం సబ్ కలెక్టరు ఎంఎ అంబరీష్ అన్నారు. పెనుగొండ మండలం ములపర్రుకు చెందిన కానిస్టేబుల్ బీవీ రమణ అందిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ విశ్రాంత ఉపాధ్యాయుడు పీతల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నరసాపురం సబ్ కలెక్టరు కార్యాలయంలో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. బీవీ రమణ చారిటబుల్ ట్రస్ట్, కృష్ణసాయి సేవా సమితి ద్వారా కరోనా సమయంలో పేదలకు ఆహారం అందించడం, ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణతో పాటు అంబులెన్స్, కైలాస రథాల నిర్వహణ విషయంలో రమణ సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. రమణను ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డీసీ హనుమంతురావు, జిల్లా అగ్నిమాపక కేంద్ర అధికారి బి.శ్రీనివాసరావు, పాలకొల్లు సహాయ జిల్లా అధికారి వైవీ జానకీ రామ్ అభినందించారు.

బాబికి గుడాల గోపి పరామర్శ



పెనుమదంలో బొడ్డు బాబిని పరామర్శిస్తున్న గుడాల గోపి

పోడూరు: పెనుమదం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి బొడ్డు బాబి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. పాలకొల్లు వైసీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి)కి సమాచారం తెలియడంతో ఆదివారం బాబి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. గోపితో పాటు డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు విన్‌స్టన్‌బాబు, కొల్లు వెంకట్రావు, అడబాల సత్తిబాబు, సురేష్, కోరుకొండ ప్రసాద్ తదితరులు బాబిని పరామర్శించారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గంగాలమ్మ, కొప్పర్రు షిరిడీ సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకుని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఎల్బీచర్ల గంగాలమ్మ అమ్మవారి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడిని చెల్లించుకున్నారు. అనంతరం కొప్పర్రు గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని స్వామివారికి మధ్యాహ్న హారతి ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుడు పోలిశెట్టి గణేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన బాబావారి గ్రామోత్సవం, అన్న సమారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

భయపెడుతున్న గోదావరి

- నరసాపురంలో క్రమంగా పెరుగుతున్న గోదావరి ప్రవాహం
- ముంపు భయంతో గోదావరి తీరం వాసులు
- ముందస్తు చర్యలు తీసుకోని అధికారులు



నరసాపురం వలంధర్ రేవు వద్ద గోదావరి ప్రవాహం



సిద్ధాంతం బ్రిడ్జిల వద్ద గోదావరి ఉధృతి

నరసాపురం: నరసాపురంలో వశిష్టగోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతూ ఉంది. ప్రస్తుతానికి ప్రవాహం ప్రమాదకరంగా లేనప్పటికీ , రెండు రోజుల్లో ఇక్కడ నీటిమట్టం భారీగా పెరిగే అవకాశం ఉంది. సముద్ర సంగమ ప్రాంత కావడంతో ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరే కొద్దీ ఇక్కడ నీటి మట్టం పెరుగుతుంది. భద్రాచలంలో నీటిమట్టం తగ్గేకొద్దీ.. ఇక్కడ నీటి మట్టం పెరుగుతుంది. దీంతో వరద ముప్పు స్థానికంగా భయపెడుతుంది. ప్రతి ఏటా వరదల సమయంలో గోదావరిని ఆనుకుని ఉన్న ప్రాంతాలు నీట మునుగుతాయి. ముఖ్యంగా నరసాపురం మండలం నవరసపురం గ్రామానికి ముంపు గండం పొంచి ఉంది. స్థానికంగా గోదావరి నీటిమట్టం కొద్దిగా పెరిగినా కూడా, గ్రామం వరద తాకిడికి గురవుతుంది. పట్టణంలో గోదావరిని ఆనుకుని ఉన్న పొన్నపల్లి, మాధవాయిపాలెం, కొండాలమ్మగుడి ప్రాంతం, నందమూరి కాలనీలు ఉన్నాయి. ముంపు భయంలో ఆ ప్రాంతాల వారు భయపడుతున్నారు. గోదావరిని ఆనుకుని ఉండటమే కాకుండా ఈ ప్రాంతాలు పల్లంగా ఉండడం వల్ల ప్రతి ఏడాది ముంపునకు గురవుతాయి.

నిద్రావస్థలో యంత్రాంగం

వరద ముంపు పొంచి ఉన్నా..అధికార యంత్రాంగం ఇప్పటి వరకూ ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టలేదు. ముంపు తాకిడి ఎక్కువగా జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఎలాంటి దృష్టి పెట్టలేదు. డివిజన్ కేంద్రంగా ఉన్న నరసాపురంలో ఇప్పటి వరకూ వరద నష్టంనివారణ, ఎదుర్కొనే చర్యలపై సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఓ సమీక్షా సమావేశం కూడా నిర్వహించలేదు. ఓ పక్క ప్రమాద పరిస్థితులను కూడా పరిగణలోకి తీసుకోకుండా నిర్లిప్తంగా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే భద్రాచలంలో ప్రమాదస్థాయిలో గోదావరి భయపెడుతుంది. కచ్చితంగా నరసాపురం ప్రాంతానికి వరద ముప్పు పొంచి ఉంది. ఏటిగట్ల రక్షణకు ఇసుక బస్తాలు సిద్ధం చేయడం, గట్లు ఎక్కడ బలహీనంగా ఉన్నాయో? గుర్తించడం, ప్రమాద ప్రాంతాల్లో గస్తీ పెట్టడం, సిబ్బందిని అప్రమత్తం చేయాలి. అయితే ఇంత కీలక సమయంలో అధికారులు ఉలుకూపలుకూ లేకుండా ఉండడంతో గోదావరి తీరం వాసులు భయపడుతున్నారు. కనీసం ప్రజాప్రతినిధులు అయినా పట్టించుకోవాలని కోరుతున్నారు.

ఉప్పొంగుతున్న వశిష్ట గోదావరి



సిద్ధాంతం కేదారీఘాట్ మెట్ల వరకు చేరిన వరద

పెనుగొండ: ఎగువ నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండడంతో వశిష్ట గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఆదివారం దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, చినమల్లం, పెదమల్లం , కోడేరు, అయోధ్యలంక భీమలాపురం గ్రామాల్లో లంకభూములను తాకుతూ నిండుగా ప్రవహిస్తుంది. ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు లంకగ్రామాల వాసులకు సూచనలు చేస్తున్నారు. సిద్ధాంతంలో కేదారీ ఘాట్ నెమ్మదిగా వరద నీటిలో మునుగుతుంది. రేపు ఉదయానికి ఘాట్ పై భాగానికి వరద రావచ్చని అంచనా వేస్తున్నారు. మధ్యస్థ లంకలోకి రాకపోకలు ఆపాలంటూ రైతులకు అధికారులు సూచనలు చేస్తున్నారు. జాలర్లు గోదావరిలో వేటకు వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఉదయానికి వరదనీరు పోటెత్తితే ప్రజల పరిస్థితి దయనీయంగా మారనుంది. దీనికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలంటూ ఆయా ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సాగుకు ఆదిలోనే హంసపాదు



పోడూరు మండలం పండిత విల్లూరులో నీట మునుగుతున్న వరి నారుమడి



పెనుగొండ మండలం ములపర్రులో నీటి మునిగిన వరి నాట్లు

పెనుగొండ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు సాగుకు ఆదిలోనే హంసపాదులా మారాయి. ఆచంట నియోజకవర్గంలో వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి. వేసిన నారుమడులు పూర్తిగా వర్షార్పణమవుతున్నాయి. ఐదు రోజుల పాటు నీటి ముంపులో ఉంటే మరోసారి నారుమడి వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలో నారుమడులు ఆచంట మండలంలో 140 ఎకరాల్లోనూ, పెనుగొండ మండలంలో 60 ఎకరాల్లోనూ, పోడూరు మండలంలో 150 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 100కు పైగా ఎకరాల్లో నారుమడులు నాలుగు రోజులుగా నీటి ముంపులోనే ఉన్నాయి,. ఇదిలా ఉండగా ఆయా మండలాల్లో 40 శాతానికి పైగా వరి నాట్లు పూర్తయ్యాయి,. పెనుమంట్ర మండలంలో అత్యధికం వరి నాట్లు పూర్తయ్యాయి. దీనిలో ఏకంగా 8400 ఎకరాలు నీటి ముంపులోనే ఉన్నాయి. ముఖ్యంగా గోస్తనీ నది పరివాహక ప్రాంత వరిచేలన్నీ నీటి ముంపులోనే ఉన్నాయి, పోడూరు మండలంలో మూడు వేల ఎకరాలు, ఆచంట మండలంలో 2వేలకు పైగాను, పెనుగొండ మండలంలో 3500 ఎకరాలకు పైగా నీటి ముంపులోనే ఉన్నాయి, మరో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే రైతన్నలు పూర్తిగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఇప్పటికే ప్రధాన పెట్టుబడి పెట్టడంతో ఎకరానికి రూ.10 వేల నుంచి 15 వేలు వరకూ నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారుమడి, నాట్లు వేయడం వంటి వాటికి అధికంగా ఖర్చు చేశామని, మళ్లీ వర్షం కురుస్తుండడంతో మురుగు డ్రెయిన్లు నిండి పోయి వర్షపు నీరు చేలల్లోనే ఉండిపోతుందని తెలిపారు. దీంతో మరోసారి నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఎదురుకావచ్చని తెలిపారు. ప్రభుత్వం రైతులు ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.75 వేలు నష్టం



నేను ఐదు ఎకరాలు కౌలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.15 వేలు ఖర్చు చేసి నాట్లు వేశాను. ఇలా ఐదు ఎకరాలకు రూ.75వేలు ఖర్చుపెట్టాను. మరో రెండు రోజులు వర్షం పడి నీరు నిలిచిపోతే పూర్తిగా నష్టపోతాను

– కౌరు కృష్ణమూర్తి, కౌలు రైతు, సిద్ధాంతం

ముంపునకు గురైన వరి చేల పరిశీలన



ఆచంట మండలంలో ముంపునకు గురైన వరి చేలను పరిశీలిస్తున్న రామాంజనేయులు

పెనుగొండ: మురుగు కాలువల నిర్వహణలోనూ, రైతులపై ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనూ రైతన్నలు అష్టకష్టాలు పడుతూ తీవ్రంగా నష్టపోతున్నారని ఏపీ కౌలు రైతుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వర్షాలతో ముంపునకు గురైన చంట మండలంలోని వల్లూరు, ఆచంట వేమవరం, వంకతాళ్ల చెరువు గ్రామాల్లోని వరి నారుమడులను ఆదివారం ఆయన పరిశీలించారు. వేలాది ఎకరాల్లో నారుమళ్లు, వరి నాట్లు దెబ్బతిన్నాయన్నారు. దీనికి ప్రధాన కారణం ఏళ్ల తరబడి మురుగు కాలువలను ఆధునీకరించకపోవడమేనన్నారు. వల్లూరు నుంచి కట్టుకాలువ వరకూ మురుగు కాలువలో తూడు, గుర్రపు డెక్క పెరిగిపోవడంతో ఈతగొట్టు పాలెం, శీలం వారి పాలెంల్లో పంటలు పూర్తిగా మునిగి దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం సత్వరం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతులు బి.సుబ్బారావు, సాకా సూర్యప్రకాశరావు, మేడిద సాంబయ్య, నార్ని సీతారామయ్య, కె.పూర్ణారావు, బి.ధర్మారావు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నక్కల కాలువను ఆధునికీకరించాలి

చినుకు పడితే ఉప్పొంగే నక్కల మురుగు కాలువ రైతులపై దుఃఖ దాయినిగా మారిందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ అన్నారు. ఆదివారం పెనుగొండ మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించి నక్కల డ్రెయిన్ ఆధునీకరణకు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతులు అప్పారి శ్రీనివాస్, ధర్నాల సూర్యనారాయణ, చిలుకూరి శ్రీనివాసరావు, ఎస్ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

పాలిథీన్‌తో నారుమడి సంరక్షణ

ఆకివీడు: భారీ వర్షాలకు ముంపునకు గురవుతున్న నారుమడులను రక్షించుకునేందుకు రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పలు చోట్ల గట్లను పటిష్టం చేసుకోవడంతో పాటు కారెంలతో ముంపు నీటిని తోడుతున్నారు. ఇదిలా ఉండగా గుమ్ములూరు గ్రామంలోని రైతు పాలడుగుల భాస్కరరావు వినూత్న రీతిలో పాలిథీన్‌తో నారుమడిని రక్షించే చర్యలు చేపట్టారు. నారుమడి గట్టుపై పాలిథిన్ పేపర్ రోల్‌ను వేసి ఆరు అంగుళాల మేర లోతులో మట్టితో పూడ్చారు. గట్టుపైన కవర్ కదలిపోకుండా మట్టిని వేసి ముంపు నీరు నారుమడిలో ప్రవేశించకుండా నిలిచిపోయింది. అలాగే నారుమడిలో అదనంగా ఉన్న నీటిని కారెంతో బయటకు తోడివేశారు. రూ.100 ఖరీదైన పాలిథీన్ పేపర్ రోల్‌ను రైతు వినియోగించారు. ముంపు నీరు తొలగితే నాట్లు వేస్తామని రైతు భాస్కరరావు చెప్పారు.

పొంగిపొర్లుతున్న డ్రెయిన్‌లు



ఆలమూరు వద్ద గట్లపై నుంచి పొంగి ప్రవహిస్తున్న గొంతేరు డ్రెయిన్



పెనుమంట్ర వద్ద మరింత పెరిగిన గోస్తనీ డ్రెయిన్ ఉధృతి

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో గోస్తనీ, గొంతేరు, భగ్గేశ్వరం డ్రెయిన్‌లలో వరదనీటి ఉధృతి ఆదివారం మరింత పెరగడంతో మండలంలోని అన్ని గ్రామాలలో పంట పొలాలు పల్లపు ప్రాంతాలు పూర్తిగా ముంపులో ఉండగా, మెరక ప్రాంతాలలో పాక్షికంగా మునిగి ఉన్నాయి. మండలంలో 12 వేల ఎకరాలలో వరినాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 8500 ఎకరాలలో వరినాట్లు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ఇంకా 3500 ఎకరాలలో నారుమడులు ముంపులోనే ఉన్నాయి. మండలంలో 2500 ఎకరాలు పూర్తి ముంపులో ఉండగా సుమారు 4వేల ఎకరాలు పాక్షికంగా మునిగి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు ఉన్న నీటి ఉధృతి పరిస్థితిని బట్టి నాలుగు రోజుల వరకు డ్రెయిన్‌లలో మురుగునీరు తగ్గే పరిస్థితి కానరాకపోవడంతో పూర్తిగా మునిగిన వరినాట్లు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అయితే రొయ్యల చెరువులు వల్ల వరిపొలాలు ముంపుకుగురౌతున్నాయని పెనుమంట్ర, వెలగలవారిపాలెం గ్రామాలకు చెందిన కొందరు రైతులు గత సోమవారం జిల్లా కలెక్టర్‌కు మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేసారు. అయితే దానిపై ఎలాంటి స్పందన లేకపోవడంతో సోమవారం మరోసారి కలెక్టర్‌ను కలవడానికి రైతులు సిద్ధపడుతున్నారు.

బెంగాలీ కార్మికుడికి పాముకాటు

పెనుగొండ: దేవలో వరి ఊడ్పులు కోసం ఆకు తీస్తున్న బెంగాలీ కార్మికుడు గిరిధర్ సర్కార్‌కు పాముకాటుకు గురయ్యాడు. ఆదివారం ఉదయం దేవలో ఆకు తీస్తుండగా రక్త పింజరి పాము కాటు వేసింది. దీంతో హుటాహుటినీ పెనుగొండలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకురావడంతో వైద్యులు వైద్య సహాయం అందించారు. విష ప్రభావంతో కార్మికుడు వేలు నల్లగా మారింది. పాముకాటుకు గురైన బెంగాలీ కార్మికుడిని సీపీఎం నాయకులు పరామర్శించారు. ఇటీవల పాము కాట్లు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవలే ఓ బెంగాలీ కార్మికుడు పాము కాటుకు బలయ్యాడన్నారు. బెంగాలీ కార్మికులుకు ప్రభుత్వం బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్, సీపీఎం నాయకులుఎస్ వెంకటేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, చిలుకూరి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు



మొగల్తూరు: కోటరోడ్డులోని బాబా ఆలయంలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



యలమంచిలి: గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో సామూహిక కలశ పూజ నిర్వహిస్తున్న మహిళలు

మొగల్తూరు: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని షిర్డీ బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.మొగల్తూరులోని కోటరోడ్డులోని బాబా ఆలయంలో వేకువజాము నుంచి భక్తులు బాబా దర్శనానికి తరలివచ్చారు. రామన్నపాలెంలోని ఆకనవారితోట, లక్కువారితోట, కెపిపాలెం, పేరుపాలెం మోళ్లపర్రు బీచ్‌లో ఉన్న బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొగల్తూరు కోటరోడ్డులోని బాబా ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో సుమారు 4 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: వ్యాస పౌర్ణమి సందర్భంగా ఆదివారం గుంపర్రు పంచాయతీ సుంకరపాలెం గ్రామంలోని గంగానమ్మ , మారెమ్మ, పోతురాజు, మనసాదేవి గుడి వద్దనున్న మర్రిచెట్టుకు కలశపూజ నిర్వహించారు. గోదావరి నుంచి కలశల ద్వారా నదీ జలాలను తీసకొచ్చి మర్రిచెట్టును దక్షిణామూర్తి స్వరూపంగా భావించి అభిషేకం చేశారు. అనంతరం విద్యార్థులతో సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ ప్రాంత మాతృశక్తి అధ్యక్షురాలు తొట్టెంపూడి సునీతదేవి, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి కటకంశెట్టి నాగేంద్ర, కార్యదర్శి అడ్డాల సూరిబాబు పర్యవేక్షించారు.

పెనుగొండలో..

పెనుగొండ: గురు పౌర్ణమి వేడుకలు పెనుగొండ, ఆచంట మండలాల్లో అత్యంత వేడుక నిర్వహించారు. వల్లూరు,పెనుగొండ, వడలి, సిద్ధాంతంల్లోని సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. వల్లూరులో సర్పంచ్ నేలపూడి బేబీ రామ్మోహన్, ఆరిమిల్లి సాయిరాం, ఆరుమిల్లి వెంకటేశ్వర్లు(చంటి), వల్లూరి గాయత్రీ దేవి, వల్లూరి సాయిప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాసవీ శాంతి థామ్‌లో

అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థామ్‌లో గురుపౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఇటీవల శివైక్యం చెందిన పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామిజీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పలు దేవాలయాలు అమ్మవార్లకు, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జుత్తిగలో శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో బాబాకు ఉదయం పాలాభిషేకం నిర్వహించి మధ్యాహ్నం లక్షబిల్వార్చన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. జుత్తిగ సోమేశ్వరస్వామి ఆలయంలో సోమేశ్వరునికి క్షీరాభిషేకం నిర్వహించారు. పెనుమంట్రలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు కుంకుమ పూజలు నిర్వహించి మహిళలు లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. మార్టేరులో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.

పక్కా డ్రెయిన్ నిర్మించాలి

నరసాపురం: పట్టణంలో రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. ప్రస్తుతం వర్షాలకు మురుగుపారక పోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాల క్రితం ఈ డ్రెయిన్ నిర్మించారు. అయితే సరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలస్థితికి చేరుకుంది. అయితే ఇక్కడ మురుగుపారక దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో పక్కా డ్రెయిన్ నిర్మించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనుగొండ: స్థానిక కోడి పందేల దిబ్బ కాలనీ సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలంటూ టీడీపీ పట్టణ కార్యదర్శి వేంద్ర రాము ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందించారు. ఆదివారం ఉదయం కొమ్ముచిక్కాలలో ఎమ్మెల్యే పితానిని కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో చవక నరసింహరావు, జడ్డు ధనరాజు, కుక్కల ఏడుకొండలు, మారిశెట్టి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు సారె సమర్పణ



చినకాపవరంలో పల్లాలమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు

ఆకివీడు: ఆషాఢ ఆదివారాన్ని పురస్కరించుకుని గ్రామ దేవతలైన అమ్మవార్లకు పలు చోట్ల సారెలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆకివీడులోని గంగానమ్మ కోడు ప్రాంతంలోని మారెమ్మ అమ్మవారికి తెలగపాముల కులస్తులు బోనాలు సమర్పించారు. చినకాపవరంలో మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు నందమూరి సత్యవతి ఆధ్వర్యంలో మహిళలు పల్లాలమ్మ, అలివేలుమంగమ్మ, పద్మావతమ్మ, పార్వతీదేవి అమ్మవార్లకు చీరలు, గాజులు, పసుపు కుంకుమ సమర్పించారు. గ్రామంలో ప్రదర్శనగా ఆయా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దింటి అమ్మవారి ఆలయంలో లలితా మహిళా మండలి ఆధ్వర్యంలో స్వీట్లు, పండ్లు, పూలు, చీరలతో సారె సమర్పించారు. అనంతరం ఊరేగింపుగా మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు.

ఉండిలో సీతమ్మ తల్లికి సారె

ఉండి: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఉండికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు (హెడ్) దంపతులు ఉండిలోని శ్రీరామక్షేత్రంలో కొలువైన సీతమ్మ అమ్మవారికి 60 రకాల పిండివంటలు, చీరలు, జాకెట్లు, గాజులు తదితరాలతో సారె సమర్పించారు. అలాగే జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి, ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గ పలువురు మహిళా భక్తులు సారెను సమర్పించారు.